జిఓ 180 అమలు చేయాలి : యుటిఎఫ్

డిఇఒకు వినతిని అందిస్తున్న నాయకులు

భీమవరం: మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులకు డిడిఒ పవర్ ఇస్తూ జిఒ 180 అమలుకు చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి కోరారు. మంగళవారం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు డిడిఒ పవర్ ఇవ్వాలని కోరుతూ డిఇఒ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపిమూర్తి మాట్లాడుతూ జిల్లాలో భీమవరం, తణుకు, పాలకొల్లు, నరసాపురం, తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్లకు డిడిఒ లిస్ట్ ఇచ్చారన్నారు. ఈ మేరకు జిఒ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కమిటీ నాయకులు విజయరామరాజు, సిహెచ్.పట్టాభి రామయ్య, యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

కొత్త విధానం.. కొంపముంచే..!

ధాన్యం కొనుగోలుపై రైతుల్లో పెల్లుబుకుతున్న ఆగ్రహం
వాహనాల్లేక ఎక్కడి ధాన్యం అక్కడే
వెంటాడుతున్న వర్షాలు
రోడ్లపై, కల్లాల్లోనే ధాన్యపురాసులు
60 శాతంపైగా మాసూలు పూర్తి
ఇప్పటి వరకు ఏడుశాతమే కొనుగోలు
బిల్లుపై ట్రక్కుషీట్ ఇవ్వకపోడంతో రైతుల్లో అయోమయం

ఉంగుటూరు మండలంలో ధాన్యపు రాసులు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం తెచ్చిన కొత్తవిధానం తమ కొంపముంచిందంటూ రెండు జిల్లాల రైతాంగం నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. దీంతో ఆరుగాలం పండించిన పంటంతా కల్లాల్లోనూ, రోడ్లపైనే ఉండిపోవడం, అల్పపీడన ప్రభావంతో వెంటాడుతున్న వర్షాలు అన్నదాతకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. వరిసాగులో ఉభయగోదావరి జిల్లాలకు ప్రత్యేక స్థానం ఉంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలవ్యాప్తంగా ఖరీఫ్‌లో దాదాపు 4.50 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. మండలాల్లోని అధికారులు, రైతుల లెక్కల ప్రకారం ఇప్పటి వరకూ దాదాపు 60 శాతం వరకూ మాసూలు పూర్తయ్యాయి. రైతులు ధాన్యం అరబెట్టి రోడ్లపైనా, కల్లాలోనే రాసులు చేసి ఉంచారు. ధాన్యం మాత్రం కొనుగోలు చేయని పరిస్థితి నెలకొంది. గతంలో కొనుగోలు కేంద్రాలు ఉన్నప్పటికీ కమీషన్ వ్యాపారులు కూడా ధాన్యం కొనుగోలు చేసేవారు. ప్రభుత్వం ఈసారి ధాన్యం కొనుగోలులో నూతన విధానం తెచ్చింది. కొనుగోలు కేంద్రాల ద్వారా మాత్రమే ధాన్యం కొనుగోలు జరగాలని నిర్ణయించింది. కానీ అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. దీంతో వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులు, అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలు రైతులకు నిద్రలేకుండా చేస్తున్నాయి. ప్రభుత్వతీరుతో వరిరైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఏలూరు జిల్లాలో 3.80 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం నిర్దేశించుకోగా ఇప్పటి వరకూ కొనుగోలు చేసిన ధాన్యం కేవలం 26 వేల టన్నులు మాత్రమే. అంటే ఏడుశాతం మాత్రమే ధాన్యం కొనుగోలు జరిగింది. మిగిలిన ధాన్యం ఎప్పటికి కొనుగోలు చేస్తారో అర్థంకాని పరిస్థితి నెలకొంది. పశ్చిమగోదావరి జిల్లాలోనూ ధాన్యం కొనుగోలు మందకొడిగానే సాగుతున్న పరిస్థితి ఉంది.

లారీల ఏర్పాటులో విఫలం

రైతులు ధాన్యం ఒబ్బిడిచేసి, ఆరబెట్టి సిద్ధంగా ఉంచినప్పటికీ రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయలేకపోతున్నారు. గతేడాది వరకూ రైతులు ధాన్యం ఆరబెట్టి రాసులు చేసిన తర్వాత వ్యాపారులే జట్టు, లారీలను పంపించి ధాన్యం కొనుగోలు చేసేవారు. కొత్తవిధానంలో అలాంటి పరిస్థితి లేకుండా పోయింది. రైతులు కల్లాలో ధాన్యం అమ్ముకునే పరిస్థితి నుంచి లారీల కోసం, జట్టుకోసం, అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది, రైతు తనపొలం మాసూలు చేసి ధాన్యం అరబెట్టిన తర్వాత తొలుత రైతుభరోసా కేంద్రంలో కలవాలి. తర్వాత టెక్నికల్ అసిస్టెంట్, వాలంటీర్ వెళ్లి తేమశాతం పరిశీలిస్తారు. తర్వాత ధాన్యం ఎప్పుడు కొనుగోలు చేసేది యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. రైతుకు ఎకరాకు 40 కిలోలు తూగే 65 సంచులు ఇస్తారు. ఎక్కువ ధాన్యం పండితే ఏంచేయాలో ఇప్పటికీ తేల్చలేదు. తర్వాత జట్టును రైతే చూసుకోవాలి. ఇవి పూర్తయిన తర్వాత రైతుభరోసా కేంద్రం అధికారులు లారీ పంపిస్తారు. ధాన్యం లోడు చేసి వేబ్రిడ్జిపై తూకం తూసిన తర్వాత ట్రక్కుషీట్ తీస్తారు. అప్పటి వరకూ ఏ మిల్లుకు ధాన్యం వెళ్తుందో కూడా రైతులకుగానీ, అధికారులకుగానీ తెలీదు. ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేసిన రైతులకు జట్టు కూలీలు దొరుకుతున్నారు. తక్కువ విస్తీర్ణం సాగుచేసిన రైతులకు జట్టు దొరక్క నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం రైతులు ధాన్యం ఆరబెట్టి సిద్ధంగా ఉన్నారు. లారీలు సమకూర్చడంలో ప్రభుత్వం విఫలమవుతోంది. దీంతో ఎక్కడి ధాన్యం అక్కడే ఉండిపోయింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. వర్షానికి ధాన్యం తడిసిపోతుందని రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. లారీలు ఏర్పాటు చేయడం, సంచులు అందించడంలో సరైన చర్యలు లేకపోవడంతో రైతులు నలిగిపోతున్నారు. దీంతో కొత్తవిధానం తమకొంప ముంచిందంటూ రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.

జట్టు బిల్లు ఎప్పుడిస్తారు..!

గతంలో ధాన్యం విక్రయించడం వరకే రైతు బాధ్యత ఉండేది. సంచులు, జట్టు బిల్లు, లారీలు అన్నీ మిల్లర్లు చూసుకునేవారు. ఇప్పుడు అన్నీ రైతులే చూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. జట్టు బిల్లు, లారీ మామూలు రూ.1300 కలిపి మొత్తం 75 కిలోల బస్తాకు రూ.22 వరకూ ఖర్చవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఖర్చులను ప్రభుత్వం ఇస్తుందని చెబుతున్నప్పటికీ ఎప్పుడిస్తారనే దానిపై స్పష్టత లేకుండా పోయింది. ధాన్యం సొమ్ముకు ట్రక్కుషీటు తీస్తున్న అధికారులు, ఖర్చులకు సంబంధించి మాత్రం ట్రక్కుషీటు ఇవ్వడంలేదని రైతులు చెబుతున్నారు. దీంతో ఇస్తారా.. ఇవ్వరా అన్న అనుమానం వ్యక్తమవుతోంది. దీనిపై స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. సొంతంగా వాహనాలు పెట్టుకుని ధాన్యం తీసుకొచ్చే రైతులకు కిరాయి సొమ్ము ఎప్పుడిస్తారో కూడా రైతులకు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

అధికారుల స్పందన కరువు

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులతో రెండు జిల్లాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతుల సమస్యలను తెలుసుకుని పరిష్కరించాల్సిన ఆ శాఖ అధికారుల నుంచి సరైన స్పందన లేకుండా పోయింది. ఏలూరు జిల్లా కేంద్రంలోని వ్యవసాయశాఖ అధికారులుగానీ, పశ్చిమగోదావరి జిల్లా పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారులు గానీ ధాన్యం కొనుగోలుపై స్పందించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. జిల్లాకలెక్టర్లు, జెసిలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటున్నప్పటికీ ఆ శాఖ అధికారుల్లో మాత్రం స్పందన లేకపోవడం ఏమిటో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఎప్పటికప్పుడు మీడియాకు సమాచారం ఇచ్చి రైతులకు భరోసా కల్పించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

లారీల్లేక ధాన్యం కొనగోలు జరగడం లేదు

లంకా వెంకటేశ్వరరావు, బొమ్మిడి

20 ఎకరాల్లో వరిసాగుచేశాను. ధాన్యం రాసులు చేసి ఉంచాం. ఒకపక్కవర్షం వెంటాడుతోంది. లారీలు లేకపోవడంతో ధాన్యం కొనుగోలు జరగడంలేదు. జట్టు సైతం దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లారీలు ఏర్పాటు చేయకపోతే రైతులకు తీవ్ర ఇబ్బందులు తప్పవు.

జట్టు బిల్లుపై స్పష్టత లేదు

దూడే కేశవ, రైతు, బొమ్మిడి

15 ఎకరాల్లో వరి సాగు చేశాను. మాసూలు చేసి ఆరబెట్టి 40 కిలోల బరువుగలవి 900 బస్తాలు విక్రయించాను. ధాన్యం సొమ్ముకు సంబంధించి ట్రక్కుషీటు ఇచ్చారు. జట్టు కూలీల ఖర్చు 75 కిలోల బస్తాకు రూ.22 వరకూ అయ్యింది. ట్రక్కుషీట్‌లో చూపలేదు. ఎవరిని అడిగినా సరైనా సమాధానం రావడం లేదు. లారీ మామూలు రూ.1300 సైతం రైతులే చెల్లిస్తున్నారు.

డిఆర్‌ఒకు వినతిపత్రం అందిస్తున్న యుటిఎఫ్ నేతలు

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి

కలెక్టరేట్ వద్ద ధర్నాలో ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయుల పిఎఫ్, ఎపిజిఎల్ఐ, డిఎ, ఎరియర్ల బకాయిలు విడుదల చేయాలని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏలూరుజిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్.రవికుమార్ అధ్యక్షతన ధర్నా మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాబ్జీ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పిఎఫ్, ఎపిజిఎల్ఐ, డిఎ ఎరియర్లు, సరెండర్ లీవులు, రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల బకాయిలు సుదీర్ఘకాలంగా చెల్లించడం లేదన్నారు. పిఆర్‌సి చర్చల సందర్భంగా ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ మార్చి 2022 నాటికి చెల్లిస్తామని హామీ ఇచ్చారని, కానీ ఇప్పటివరకూ బకాయిలు చెల్లించలేదని తెలిపారు. జులైలో కొద్దిపాటి పిఎఫ్ మొత్తం ఇవ్వడం తప్ప మిగిలిన ఆర్థిక బకాయిలు ఇంతవరకూ చెల్లించలేదని, పలుమార్లు కోరినా బకాయిలు విడుదల చేయడం లేదన్నారు. రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన సంబంధిత బకాయిలు రూ.1826 కోట్లు వెంటనే విడుదల చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జెఎసి నాయకులు ఆర్ఎస్ హరినాథ్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా బకాయిలు చెల్లించకపోవడం వల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని చెప్పారు. జెఎసి కార్యదర్శి చోడగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ వివాహ, ఆసుపత్రి ఖర్చులు వంటి అత్యవసర సందర్భాలకు అందాల్సిన సొమ్ములు అందక ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు ఎల్‌వి.సాగర్ మాట్లాడుతూ ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని లేకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పివి.నరసింహారావు మాట్లాడుతూ పిఎఫ్ బకాయిలు సుమారుగా రూ.30 కోట్లు, ఎపిజిల బకాయిలు రూ.20 కోట్లు, డిఎలు, సరెండర్ లీవులు, మెడికల్ బిల్లుల మొత్తం రూ.65 కోట్లతో మొత్తం ఈ జిల్లాలో రూ.115 కోట్లు ఉమ్మడి జిల్లాగా బకాయిలున్నాయని తెలిపారు. అనంతరం డిఆర్‌ఒ సత్యనారాయణమూర్తికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.సోమయ్య, జెఎసి నాయకులు నెరుసు రామారావు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.శ్రీదేవి, ఏలూరు జిల్లా గౌరవాధ్యక్షులు ఎంవి.శ్యాంబాబు, కోశాధికారి షేక్ ముస్తాఫా అలీ, సహాధ్యక్షులు జి.వెంకటేశ్వరావు, యుటిఎఫ్ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు పి.జయకర్, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, ప్రధానకార్యదర్శి ఎకెవి.రామభద్రం, గౌరవ అధ్యక్షులు ఎం.మార్కండేయులు, కోశాధికారి సిహెచ్.పట్టాభి రామయ్య, కార్యదర్శులు జి.రాజేంద్రప్రసాద్, ఎంవి.అప్పారావు, ఎస్.సుధారాణి, బివి.రవీంద్ర, ఎన్.రాంబాబు, పి.క్రాంతికుమార్, జి.లక్ష్మీనారాయణ, జి.రామకృష్ణంరాజు, కె.రామకృష్ణ ప్రసాద్, ఏలూరు జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.బేతాళరావు, ఏలూరు జిల్లా సిపిఎస్ కన్వీనర్ కె.కమల్‌కుమార్ ఈ ధర్నాలో ప్రసంగించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ : కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని ప్రతి మండలంలో వారం రోజుల పాటు పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పారిశుధ్యం, ఎస్‌డిజి సర్వే, జగనన్న తోడు అంశాలపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. జిల్లాలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు కనిపిస్తున్నాయన్నారు. పరిశుభ్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పారిశుధ్య నిర్వహణ సరిగ్గా లేదని వీరవాసరం ఎంపిడిఒపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే తీరు కొనసాగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి మండలంలో ప్రత్యేక డ్రైవ్ ద్వారా పారిశుధ్య పనులను చేపట్టాలని సూచించారు.

ధాన్యం కొనుగోలను వేగవంతం చేయాలి

రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కేశవరావు

మాట్లాడుతున్న వై.కేశవరావు

ప్రజాశక్తి - భీమవరం

ధాన్యం కొనుగోలను వేగవంతం చేయాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.కేశవరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భీమవరం కార్మిక సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి అధ్యక్షతన జరిగిన సంఘం జిల్లా కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఎకరాకు 26 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామని నిబంధన పెట్టడం సరైన విధానం కాదని విమర్శించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణగా రైతులు ఆందోళన చెందుతుంటే ప్రభుత్వం ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేయడంలో అలసత్వం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం రవాణా కోసం ప్రభుత్వమే వాహనాలు సిద్ధం చేయాలని కోరారు. ప్రతీ రైతు భరోసా కేంద్రం వద్ద గోనె సంచులు రైతులకు అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రభుత్వం ప్రకటించినట్లుగా 75 కేజీలు బస్తాకు 'ఎ' గ్రేడ్‌కు రూ.1545 కాకుండా రూ.255 రాష్ట్ర ప్రభుత్వం భరించి రూ.1800 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధాన్యం సొమ్ముల గతం మాదిరిగా కాకుండా 21 రోజుకే ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరే రామ్ మాట్లాడుతూ చిన్న సన్నకార ఆక్వా రైతులు దివాళా తీసే పరిస్థితిలో ఉన్నారని దీనికి కారణం ప్రభుత్వం రైతులకు కోల్డ్ స్టోరేజీలు నిర్మించకపోవడం, సరైన ధర ప్రకటించకపోవడం కారణమన్నారు. దళారులను అరికట్టి ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా బాబూరావు

సంఘం జిల్లా సీనియర్ నాయకులు చింతకాయల బాబూరావును రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సమావేశంలో బాబూరావును సంఘం జిల్లా కమిటీలోకి కో ఆప్షన్ చేసుకుని జిల్లా ఉపాధ్యక్షులుగా కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకుని ఆమోదించారు. ఈ సమావేశంలో చిర్ల పుల్లారెడ్డి, కిలారి తవిటి నాయుడు, ఇందుకూరి సూర్యనారాయణరాజు, చింతపల్లి లక్ష్మీకుమారి, కొప్పిశెట్టి సత్యనారాయణ, గుత్తుల శ్రీరామచంద్రుడు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్రీడామైదానాల ప్రయివేటీకరణ ఆపాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

క్రీడామైదానాల ప్రయివేటీకరణను ఆపాలని, పేఅండ్‌ప్లే క్రీడా విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ తాడేపల్లిగూడెం డివైఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక యాగర్లపల్లిలో మహత్మగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు రౌతు వెంకటనాగేంద్ర, పట్టణ నాయకులు వర్రి అప్పారావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రౌతు వెంకటనాగేంద్ర, వర్రి అప్పారావు మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వం క్రీడాకారులతో ఆటలు ఆడుతోందని ప్రభుత్వాన్ని విమర్శించారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసి, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు తయారు చేయాల్సిన శాప్ ఆ పని చేయకుండా క్రీడలతో వ్యాపారం చేయడం తగదని వారన్నారు. కేవలం ఆదాయం కోసం స్టేడియాలను ప్రయివేటు వ్యక్తులకు లీజుకు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. శాప్ ఎమ్‌డి, ఛైర్మన్ క్రీడాకారుల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రభుత్వం ఈ వైఖరిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ప్లే క్రీడా పాలసీని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. క్రీడా మైదానాలు,స్టేడియాల ప్రయివేటీకరణ నిర్ణయం సిగ్గుచేటన్నారు. క్రీడాకారులు మైదానంలోకి అడుగుపెట్టాలంటే సభ్యత్వం రూ.3 వేలు, నెల ఫీజు రూ.1500 చెల్లించి ఆటలు నేర్చుకోవాలంటూ శాప్ ఆదేశాలు జారీ చేసిందని, ఈ నిర్ణయం క్రీడాకారుల పాలిట శాపంగా మారనుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించి క్రీడాభివృద్ధి చేయాల్సింది పోయి పే అండ్ ప్లే విధానం ప్రవేశపెట్టడం పేద క్రీడాకారులను క్రీడలకు దూరం చేయడమేనని వారన్నారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం క్రీడా మైదానాల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో యువజన, విద్యార్థులను, క్రీడాకారులతో పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి కె.రామకృష్ణ, ఎస్.శేషుబాబు, పి.నాగేంద్రబాబు, వంశీ, యువజన విద్యార్థులు పాల్గొన్నారు.

డివైఎఫ్ఐ నాయకుల అరెస్టుకు ఖండన

పెనుమంట్ర : పే అండ్ ప్లే పేరుతో ఆట స్థలాల్లో క్రీడాకారుల నుంచి డబ్బులు వసూలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేసిన రాష్ట్ర డివైఎఫ్ఐ నాయకులను అరెస్టు చేయడాన్ని మంగళవారం డివైఎఫ్ఐ మండల కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి చింతపల్లి మావో మాట్లాడుతూ క్రీడలను కూడా వ్యాపారంగా మార్చే రాష్ట్ర ప్రభుత్వ విధానాన్ని డివైఎఫ్ఐ వ్యతిరేకిస్తోందన్నారు. ఈ విధానానికి వ్యతిరేకంగా సోమవారం ప్రజాస్వామ్య బద్ధంగా విజయవాడలో నిరసన తెలియజేయడానికి వెళ్లిన డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై.రాము, జి.రామన్న, జిల్లా కార్యదర్శి గేదెల ధనుష్, నాయకులు నాగేశ్వరరావు, కృష్ణ, కృష్ణకాంత్ తదితరులను అరెస్టు చేయడం దారుణమన్నారు. తక్షణం సాప్ పేఅండ్‌ప్లే పాలసీని వెంటనే ఉప సంహరించుకోవాలి డిమాండ్ చేశారు.

క్షౌర వృత్తిదారుల పొట్ట కొట్టొద్దు

నాయీ బ్రాహ్మణుల నిరసన

అంబేద్కర్ సెంటర్లో నిరసన తెలుపుతున్న నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

క్షౌర వృత్తిలోని రిలయన్స్ సంస్థ ప్రవేశాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక అంబేద్కర్ సెంటర్లో నియోజవర్గ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా క్షౌర వృత్తిదారుల పొట్ట కొట్టొద్దు.. రిలయన్స్ కార్పొరేషన్ షెడ్యూల్ షాపులను వ్యతిరేకించండి.. గో బ్యాక్ రిలయన్స్ సెలూన్స్ అని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం నాయీ బ్రాహ్మణుల సేవా సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు ఉప్పల దుర్గా పెద్దిరాజు మాట్లాడుతూ క్షవుర వృత్తిలోకి రిలయన్స్ సంస్థ ప్రవేశించి రాష్ట్రవ్యాప్తంగా ఆరువేల సెలూన్ షాపులు పెడతామని ప్రకటించారన్నారు. ఏళ్ల తరబడి ఈ వృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న తాము రిలయన్స్ సంస్థ సెలూన్ షాపులతో ఆర్థికంగా దెబ్బ తింటామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి సిఐటియు పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల త్రిమూర్తులు సంఘీభావం తెలిపి మాట్లాడారు. క్షౌర వృత్తిలోకి రిలయన్స్ కార్పొరేట్ సంస్థలు ప్రవేశించి వారి పొట్ట కొట్టాలని చూస్తున్నాయన్నారు. అనంతరం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు కట్టుంగ నరేష్, పట్నాల జగన్, కువిడి రత్నరాజు, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, ఇసుకపూడి రాము, సారిక బేజు బాబు పాల్గొన్నారు.

విభజన హామీల సాధనే లక్ష్యంగా ఉద్యమించాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న బలరాం

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనే లక్ష్యంగా ఉద్యమించాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు పిలుపునిచ్చారు. యుటిఎఫ్ జిల్లా కేంద్రంలో ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం సిపిఎం, సిపిఐ పట్టణ కార్యదర్శులు బురిడి వాసుదేవరావు, చెల్లబోయిన రంగారావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ నాడు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేసి ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసిందని గుర్తు చేశారు. ప్రతిపక్షంలో ఉన్న బిజెపి పార్లమెంట్ సాక్షిగా ప్రత్యేక హోదా ఐదు సంవత్సరాలు కాదు పది సంవత్సరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారని తెలిపారు. కేంద్రంలో ఎనిమిదేళ్లుగా అధికారంలో ఉంటున్న బిజెపి ప్రభుత్వానికి ప్రత్యేక హోదా విభజన హామీలు గుర్తులేదా అని ప్రశ్నించారు. 2014లో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు. విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రం పట్ల వివక్ష చూపుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలైన రాయలసీమ ఉత్తరాంధ్రకు విధులు కేటాయింపులో కూడా అన్యాయం చేయడం దారుణమన్నారు. దేశంలో ఆదాయం పెంచే అతిపెద్ద సంస్థల్లో ఒకటైన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మకం పెట్టడం దారుణమన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ ఆలోచన విరమించుకునే వరకూ ఉద్యమిస్తామని హెచ్చరించారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ జాడేలేదని ఎద్దేవా చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కోణాల భీమారావు, ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు లంక కృష్ణమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేస్తున్న అన్యాయంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షాలు కూడా ప్రశ్నించడంలో ఘోరంగా విఫలమయ్యాయని మండపడ్డారు. మోడీ ప్రభుత్వానికి వైసిపి, టిడిపి జనసేన పార్టీలు ఊడిగం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 26న దేశ రాజధాని ఢిల్లీలో ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న ధర్నాకు వామపక్షాలు ప్రజాసంఘాలు వివిధ సంస్థలు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు తెలిపారు. దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర్‌కుమార్, సిఐటియు జిల్లా నాయకులు మల్లెపూడి ఆంజనేయులు, పట్టణ ప్రజల సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ ఎం.వైకుంఠరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం విధానాలపై వామపక్షాలు ప్రజాసంఘాలు వివిధ సంస్థలతో ప్రజలందరినీ కలుపుకుంటూ ఐక్య పోరాటాలు చేయాల్సి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు, సిపిఎం పట్టణ నాయకులు చల్లబోయిన వెంకటేశ్వరరావు, సిపిఐ నాయకులు సిక్కిలే పుష్పకుమారి, మల్లుల సీతారాం, దళిత నాయకులు పాలపర్తి జోనా, గడ్డం జార్జి పాల్గొన్నారు.

రూ.7.50 కోట్లతో నగర పంచాయతీ అభివృద్ధి

చైర్‌పర్సన్ జామి హైమావతి

ఛైర్ పర్సన్ జామి హైమావతిని సత్కరిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి - ఆకివీడు

ఏడున్నర కోట్ల రూపాయలతో నగర పంచాయతీని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయనున్నట్లు ఛైర్ పర్సన్ జామి హైమావతి తెలిపారు. తొలిసారిగా ఆకివీడు నగర పంచాయతీ పాలకవర్గం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా మంగళవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఛైర్ పర్సన్ జామి హైమావతి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సభకు జాన్ హైమావతి అధ్యక్షత వహించి మాట్లాడారు. గతంలో పంచాయతీకి రావాల్సిన నిధులు రూ. 2 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో విడుదలవుతాయని ఆమె తెలిపారు. అమృత్ పథకం కింద పట్టణానికి పరిశుభ్రమైన తాగునీరు అందించేందుకు మరో ఐదు కోట్ల రూపాయలు మంజూరవుతున్నట్లు తెలిపారు. ఈ మొత్తం పట్టణాభివృద్ధికి ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ విప్ పడాల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్ గేదెల అప్పారావు మాట్లాడుతూ గత సంవత్సర కాలంగా పట్టణంలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. అనంతరం తొలిసారిగా ఏర్పడిన కౌన్సిల్ పేర్లతో కూడిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. తరువాత ఛైర్ పర్సన్ హైమావతిని సత్కరించారు. కార్యక్రమంలో కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వరరావు, మేనేజర్ కౌన్సిలర్లు సిబ్బంది పాల్గొన్నారు.

సింహాచలం భౌతికకాయంపై పార్టీ జెండాను కప్పి జోహార్లు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం సీనియర్ నాయకులు సింహాచలం మృతి

ప్రజాశక్తి - ఆచంట

సిపిఎం ఆచంట సీనియర్ సభ్యులు కొత్తపల్లి సింహాచలం (68) మంగళవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన 1947 నుంచి ఇప్పటివరకూ సిపిఎంలో కొనసాగుతున్నారు. వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆయన ఎంతో కృషి చేశారని సిపిఎం సీనియర్ నాయకులు తోటపల్లి సత్యనారాయణ తెలిపారు. సింహాచలం మృతి పార్టీకి తీరని లోటని తెలిపారు. సింహాచలం భౌతికకాయంపై పార్టీ నాయకులు కొత్తూరు శాఖ కార్యదర్శి మన్నె బ్రహ్మేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు ఎవివిఎస్.శర్మ, అంజిబాబు, సిర్రా నర్సింహమూర్తి, వద్దిపర్తి శ్రీనివాస్, చొప్పల మోహన్, మానుకొండ రాంబాబు, చదలవాడ చంటిబాబు, రజక వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు యండమూరి సుబ్బారావు సిపిఎం పతాకాన్ని ఉంచి నివాళులర్పించారు. సింహాచలం మృతి పట్ల సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్, ఆచంట మాజీ శాసనసభ్యులు దిగుపాటి రాజగోపాల్, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

రైతులకు కూలీల ఖర్చులు చెల్లిస్తాం

ప్రజాశక్తి - వీరవాసరం

ధాన్యం పట్టుబడిలో రైతులు కూలీలను సమకూర్చుకుంటే కూలి ఖర్చులు ప్రభుత్వమే చెల్లిస్తుందని మండల వ్యవసాయాధికారి గీతాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం కొనుగోలులో రైతులు ఆందోళన చెందనవసరం లేదని తెలిపారు. ధాన్యం పట్టుబడికి సంబంధించి రైతులు సమకూర్చుకున్న కూలీలకు క్వింటాకు రూ.25, అలాగే టన్ను ధాన్యానికి రవాణ ఖర్చు కింద ఎనిమిది కిలోమీటర్లకు రూ.324, ఎనిమిది కిలోమీటర్లు దాటితే ప్రతి కిలోమీటరుకు రూ.పది అదనంగా ప్రభుత్వం రైతులకు చెల్లిస్తుందన్నారు. ఇదే విధంగా రైతులు తమ సొంత గోనె సంచుల్లో ధాన్యం పట్టి ఇస్తే సంచికి రూ.3.39 అద్దె చెల్లిస్తుందని తెలిపారు. అవసరమైతే గోనె సంచులు ఆర్‌బికెల వద్ద అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

మొగల్తూరు: ప్రభుత్వం నిర్దేశించిన 17 శాతం తేమ ఉన్న ధాన్యం విక్రయానికి రైతు భరోసా కేంద్రాలకు సమాచారం అందించాలని వ్యవసాయ ఎడిఎ ఈదా అనిల్ కుమారి రైతులకు సూచించారు. మొగల్తూరులోని మండల పరిషత్ కార్యాలయంలో ఎఒ ఎం.సుజాత అధ్యక్షతన నిర్వహించిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సమావేశంలో ఆత్మ కమిటీ ఛైర్మన్ కంచర్ల బాబు, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీసితార పుట్టినరోజు

ప్రజాశక్తి - ఆచంట

సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్, ఆచంట మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ ఇందిరా సీతారామ్ రెండో కుమార్తె సుంకర లక్ష్మీసితార పుట్టినరోజు సందర్భంగా కొడమంచిలి పెదపేట చర్చి వద్ద మంగళవారం జరిగింది. ఈ వేడుకలకు ముఖ్య అతిధిగా ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాధరాజు తనయులు చెరుకువాడ నర్సింహారాజు (నరేష్) విచ్చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపిటిసి యల్లమెల్లి రాజేష్, వేమవరం సర్పంచి జక్కంశెట్టి చంటి, సొసైటీ అధ్యక్షులు వీర భద్రం పాల్గొన్నారు.

వల్లూరులో మొక్కల పంపిణీ

ప్రజాశక్తి - ఆచంట

టిడిపి మండల సీనియర్ నాయకులు ఉండవల్లి పాపారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం ఆయన మనవలు, మనవరాళ్లు సజ్జ కిరణ్, ఆలపాటి భవాని, గారపాటి సంజన, కొడవటి శిరీష, బోళ్ల సందీప్, కావూరి సౌమ్య, తుమ్ము రమ్య ఆ గ్రామంలో పర్యావరణ పరిరక్షణ కోసం వినూత్న రీతిలో మొక్కలు, బ్యాగులు పంపిణీ చేశారు.

పేదల ఆకలి తీర్చేందుకే అన్నా క్యాంటీన్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పేదల ఆకలి తీర్చడానికి 12 వారాలుగా ప్రతి మంగళవారమూ క్రమం తప్పకుండా అన్నా కాంటీన్ వద్ద అన్నదానం చేస్తున్నట్లు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి అన్నారు. స్థానిక తాలూకాఫీస్ సెంటర్లో అన్నా క్యాంటీన్ వద్ద మంగళవారం పేదలకు ఉచితంగా భోజనం అందజేశారు. మైనార్టీ సెల్ నాయకుడు షేక్ బాజీ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ పేదల ఆకలి మంటలు తీర్చే విధంగా నారా చంద్రబాబు నాయుడు పట్టణంలో అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేశారన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చేవరకూ ప్రతి కార్యకర్తా కష్టించి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పోతుల అన్నవరం, కిలపర్తి వెంకటరావు, గంధం సతీష్, కృష్ణమోహన్, వాడపల్లి సుబ్బరాజు, పసల కొండ, ముత్యాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైతు వద్ద ధాన్యం సేకరణ పరిశీలిస్తున్న చేస్తున్న ఎఒ మద్దాల జయదుర్గా మాధురి

రైతులు తేమశాతం చూసుకోవాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఆర్‌బికెల్లో రైతులు ధాన్యాన్ని అమ్మేటప్పుడు తేమశాతం, బరువు కచ్చితంగా చూసుకోవాలని ఎఒ మద్దాల జయదుర్గా మాధురి తెలిపారు. మంగళవారం మల్లిపూడిలో రైతుల వద్ద ధాన్యం సేకరణ పరిశీలనకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 40 కేజీల బస్తాలతో పాటు 580 గ్రాములు మాత్రమే రైతు నుంచి బరువుతో ధాన్యాన్ని తీసుకోవాలన్నారు. నిన్న, మొన్నటి వరకూ దళారులు బస్తా బరువుతో పాటు ఒక కిలో అదనంగా చూసుకోవడం జరుగుతోందన్నారు. అలా జరిగినప్పుడు రైతు పండించిన పంటకు గండి పడేదన్నారు. రైతుల నుండి తాము ధాన్యాన్ని సేకరించి సమయంలో కచ్చితంగా తేమశాతం చూసుకోవాలన్నారు. ఆమె వెంట ఎఇఒ సత్యనారాయణ, సిబ్బంది రైతులు ఉన్నారు.

చంద్రబాబుపై వైసిపి లీగల్ సెల్ నేతల ఫిర్యాదు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మాజీ ఎంఎల్‌సి చెంగల్ రాయుడుపై భీమవరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం వైసిపి లీగల్ సెల్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చంద్రబాబు నాయుడు కర్నూలు జిల్లా పర్యటనలో మాజీ ఎంఎల్‌సి చెంగల్ రాయుడు పోలీసులను కించపరిచేలా, న్యాయ వ్యవస్థను తప్పు దారి పట్టించేలా మాట్లాడారని తెలిపారు. ఇటువంటి నాయకులు మాటల వల్ల సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందన్నారు. వైసిపి లీగల్ సెల్ అధ్యక్షుడిగా భీమవరం అసెంబ్లీ లీగల్ సెల్ కమిటీ ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకుల సమక్షంలో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల ధనుంజయరావు, వైసిపి లీగల్ సెల్ అధ్యక్షులు బడుగు అశోక్ బాబు, భీమవరం నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు పి.పెద్దిరాజు పాల్గొన్నారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మాట్లాడుతున్న రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి ట్రెజరర్ మంతెన వెంకట రవివర్మ

సమావేశానికి హాజరైన రైతులు

రైతుల సమస్యలపై ఉద్యమిస్తా

రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి ట్రెజరర్ మంతెన వెంకట రవివర్మ

ప్రజాశక్తి - కాళ్ల

రైతుల కోసం తన తండ్రి అలుపెరగని పోరాటం చేశారని, ఆయన స్ఫూర్తితోనే పార్టీలకతీతంగా స్వచ్ఛందంగా రైతుల సమస్యలపై ఉద్యమిస్తానని రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి ట్రెజరర్ మంతెన వెంకట రవివర్మ స్పష్టం చేశారు. ఏలూరుపాడు గ్రామంలో ఆయన స్వగృహం వద్ద రైతు కార్యాచరణ సమితి సమావేశం మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి అధ్యక్షులు కలిదిండి గోపాలకృష్ణంరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సమితి ట్రెజరర్ మంతెన వెంకట రవివర్మ మాట్లాడుతూ నాన్న స్ఫూర్తితో రైతుల కోసం పోరాడుతానని, రైతులు పచ్చగా ఉన్నప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. రైతుల సమస్యలపై తన తండ్రి సూర్యనారాయణరాజు బాటలో పోరాటం చేస్తానని తెలిపారు. వరి, ఆక్వా, ఇతర వాణిజ్య రైతుల సమస్యలపై పోరాడతానని తెలిపారు. రైతుల సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి వారికి అండగా ఉంటానని తెలిపారు. రైతులు ఎదుర్కొనే ప్రతి సమస్యను కలెక్టర్, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. తండ్రి స్ఫూర్తితో పోరాటం చేస్తానని తెలిపారు. రైతులందరితో కలిసి ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్‌కు త్వరలో వినతిపత్రం అందజేస్తామని రవివర్మ తెలిపారు. సమావేశంలో ఉపాధ్యక్షులు దాట్ల లక్ష్మీపతిరాజు, ప్రధాన కార్యదర్శి పాతపాటి మురళీ రామరాజు, సభ్యులు పాలకృష్ణంరాజు, మంతెన కృష్ణంరాజు, కె.కమలాకర్ శర్మ, ఎం.దుర్గాప్రసాద్, రైతులు గనిశెట్టి నారాయణమూర్తి, వక్కపట్ల సురేష్, వక్కపట్ల హరిబాబు, తలగళ్ల వెంకటేశ్వరరావు, పి.చంటి, మాజీ సర్పంచి మంతెన ఆంజనేయరాజు, మంతెన హిమదుర్గ, మంతెన ఉమా శ్రీలక్ష్మి, మాజీ సర్పంచి ఆనందరావు పాల్గొన్నారు.

ధాన్యం విక్రయంపై ఆంక్షలు దారుణం

రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వాసుదేవరావు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో గత 20 రోజులుగా రైతు పంటను స్వేచ్ఛగా అమ్ముకోవడానికి అవకాశం లేకుండా ప్రభుత్వం ఆంక్షలు విధించడం దారుణమని రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.వాసుదేవరావు విమర్శించారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో మంగళవారం నాయకులు కె.సత్యనారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడాతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు పంటపై ఆంక్షలు విధించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని విమర్శించారు. ఆర్‌బికె కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొంటానన్న ప్రభుత్వం దానికి అనుగుణంగా అధికార యంత్రాంగాన్ని ఏర్పాటు చేయలేకపోయిందని విమర్శించారు. మరో పక్కన రైస్ మిల్లుల్లో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులకు సరైన పనుల్లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైస్ మిల్లు మూతపడే పరిస్థితి వచ్చిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి రైతు పండించే పంట స్వేచ్ఛగా అమ్ముకునే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైస్ మిల్లుల్లో పనిచేస్తున్న కార్మికుల ఉపాధి కాపాడాలని కోరారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు త్రిమూర్తులు, కె. సత్యనారాయణ, కె.సత్తిబాబు, నతానియేలు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల పరిశీలన

పాలకొల్లు: ఎన్‌టిఆర్ టిడ్కో ఇళ్లలోకి పందులు, పాములు వస్తున్నాయని అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు కోరారు. మంగళవారం ఆయన టిడ్కో గృహాలను పరిశీలించారు. ఏ చిన్న సమస్య ఉన్నా నాతో చెప్పుకోవచ్చని, టిడ్కో ఆఫీస్ వద్ద ఫిర్యాదు బుక్ పెట్టామని చెప్పారు. ఎక్కువగా లైట్ల సమస్య వస్తోందని తాత్కాలికంగా కొన్ని లైట్లు వేసిన కాలిపోయాయని చెప్పారు. దీంతో ప్రజలు చీకట్లో మగ్గిపోతున్న పరిస్థితి ఉందన్నారు. తుప్పలు బాగా పెరిగి పాములు తిరుగుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో పందులు సంచరిస్తున్నాయని తెలిపారు. సమస్యలను కమిషనర్ దృష్టిలో పెట్టామని తెలిపారు. లైట్లు సంబంధించి సమస్య ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ స్పెషల్ ఆఫీసర్‌తో మాట్లాడామని చెప్పారు. ఆయన వెంట పెచ్చెట్టి బాబు జివి పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పాలకొల్లు - నరసాపురం రోడ్డులో సగంచెర్వు గ్రామంలో నిడదవోలు కాలువపై నాలుగున్నర సంవత్సరాలుగా జరుగుతున్న ఆర్‌అండ్‌బి బ్రిడ్జి పనులను ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సగంచెర్వు బ్రిడ్జి అందరి చిరకాల కోరిక అని, టిడిపి హయాంలో శాసనసభ్యునిగా సగంచెర్వు బ్రిడ్జికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ మార్గం గుండా గోరింటాడ, ఆగర్రు, అగర్తిపాలెం, వెలివెలి ఇలా 7, 8 గ్రామాలకు, నర్సాపురం నుండి భీమవరం వయా లంకలకోడేరు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. ఇక్కడ లూజ్ సాయిల్ అని చెప్పి ఆర్ అండ్ బి అధికారులు తిరస్కరించడంతో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దగ్గరికి స్వయంగా వెళ్లి ఆగర్తిపాలెం బ్రిడ్జి నిర్మాణానికి రూ.10 కోట్లు, పూలపల్లి నుంచి ఆగర్తిపాలెం రోడ్డుకు రూ.10 కోట్లు చంద్రబాబునాయుడుచే అనుమతులు ఇప్పించినట్లు తెలిపారు. 2018లో శంకుస్థాపన చేయించి పనులు చేపట్టడం జరిగిందని, ప్రభుత్వాలు మారడం వల్ల కాంట్రాక్టర్లకు నిధులు మంజూరు చేయడంలో ఆలస్యం కావడంతో ఇప్పటికీ మూడున్నర సంవత్సరాలు గడిచిందని తెలిపారు. మరో 2 నెలల్లో వంతెన పూర్తవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కోడి విజయభాస్కర్, చెల్లబోయిన సహదేవుడు, మామిడిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెట్టుపై నుంచి జారిపడి గీత కార్మికుడు మృతి

మొగల్తూరు: మండలంలోని పేరుపాలెం నార్త్‌లో కొబ్బరి చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తూ జారి పడి గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన కవురు లక్ష్మీకాంతరావు (59) కొబ్బరికాయలు దింపు, కల్లుగీత కార్మికునిగా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కొబ్బరి కాయలు దింపే క్రమంలో చెట్టుపై నుండి జారిపడి మృతి చెందారు. ఆయనకు భార్య మంగతాయారు, కుమారుడు నాగరాజు, కుమార్తె లీల కుమారి ఉన్నారు.



మృతుడు లక్ష్మీకాంతరావు (ఫైల్‌ఫోటో)

ఎస్ఆర్‌కెఆర్ విద్యార్థుల ప్రతిభ

భీమవరం రూరల్: ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ ఐబిఎం జాతీయ స్థాయిలో నిర్వహించిన హ్యాక్ ఛాలెంజ్ 2022లో ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల జాతీయస్థాయిలో రెండు అవార్డులు అందుకుందనీ కళాశాల ప్రిన్సిపల్ ఎం.జగపతిరాజు మంగళవారం చెప్పారు. ఆయన మీడియాకు వివరాల అందిస్తూ ఐబిఎం జాతియ స్థాయిలో హ్యాక్ ఛాలెంజ్ పోటీలకు జాతీయస్థాయిలో 1321 కళాశాలల నుంచి 20,500 మంది పాల్గొన్నారని తెలిపారు. అందులో 331 టీమ్స్‌ను ఎంపిక చేశారు. అందులో 9 టీంలు చక్కని ప్రతిభ కనబర్చడంతో వారికి జ్యూరీ అవార్డుతో ఎంపిక చేశారు. అందులో ఎస్ఆర్‌కార్ ఇంజినీరింగ్ కళాశాల టీం ఒకటి ఎంపికవ్వటం పట్ల కళాశాల ప్రిన్సిపల్ ఆనందం వ్యక్తం చేశారు. కళాశాలలో మూడో సంవత్సరం ఐటి చదువుతున్న విద్యార్థులు ఏ సాక్షిట్, వర్షిణి, ఆర్.జోహారికలు ఈ అవార్డును దక్కించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి బృందం మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల ఉపాధ్యక్షులు ఎస్వి.రంగరాజు, ప్రిన్సిపల్ ఎం.జగపతిరాజు, ఐటి విభాగం హెడ్ బిహెచ్‌వి రామకృష్ణంరాజు తదితరులు విద్యార్థులను అభినందించారు.

అన్ని రంగాల్లో మహిళలు ముందంజ

భీమవరం రూరల్ : స్వాతంత్ర్యం అనంతరం మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించి దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నారని భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతి రాజు అన్నారు. మంగళవారం ఆజాదికా అమృత్ మహోత్సవ కార్యక్రమాల్లో భాగంగా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్వాతంత్ర్యం అనంతరం మహిళల ప్రగతి అనే అంశంపై ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ ప్రారంభించిన జగపతి రాజు మాట్లాడుతూ నాటి ఇందిరా గాంధీ నుండి నేటి ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ వరకు ఎందరో మహిళలు రాజకీయ రంగంలో రాణించటమే కాకుండా తమ ప్రాధాన్యతను దేశానికి అందించే స్థాయిలో ఎదిగారన్నారు. అదేవిధంగా క్రీడల్లో మితేలీ రాజ్, సానియా మీర్జా, పీవీ సింధు వంటి క్రీడాకారులు భారతదేశ కీర్తి పతాకాన్ని ప్రపంచానికి చాటి చెబుతున్నారు. కళాశాల ఉపాధ్యక్షులు ఎస్వి రంగరాజు మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

రొయ్యల దొంగలపై చర్యలు తీసుకోండి

ఉండి: కోలమూరు గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు పేరిచర్ల బాలకృష్ణ రాజు రొయ్యల చెరువులో దొంగతనానికి పాల్పడిన దొంగలను తక్షణం పట్టుకుని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎంఎల్ఎ మంతెన రామరాజు కోరారు. రొయ్యల దొంగతనం జరిగిన చెరువును మంగళవారం ఎంఎల్ఎ మంతెన రామరాజు పరిశీలించి రైతు బాలకృష్ణరాజును వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ ఆక్వా రైతులకు గిట్టుబాటు ధర లేక సీడు, మందులు, మేతల ధరలు పెరగడంతో ఆక్వా రైతులు అప్పులు ఊబిలోకి కూరుకు పోతున్నారని, ఇలాంటి సమయంలో ఇలా దొంగతనాలు జరిగితే రైతుల పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా దొంగతనాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

వైఎన్ డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

వైఎన్ కళాశాల (అటానమస్) డిగ్రీ రెండు, నాలుగో సెమిస్టర్ ఫలితాలను మంగళవారం కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ చినమిల్లి సత్యనారాయణరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగో సెమిస్టర్ ఫలితాల్లో బిఎస్ విభాగంలో ఆర్.రాణి 95.6 శాతం మార్కులు సాధించి కళాశాల ప్రథమ స్థానం సాధించిందన్నారు. బికాంలో 87.3 మార్కులతో పి.లావణ్య, బిబిఎ విభాగంలో 87.8 శాతం మార్కులతో ఎం.నాగ బాలాజీ, బిఎలో ఎం.బాను సాయి 90.4 శాతం మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. సెకండ్ సెమిస్టర్ ఫలితాల్లో బిఎస్‌సి విభాగంలో ఎం.అస్మదున్నిసా 95.2 శాతం, బికాంలో ఆర్.అష్రఫ్ 85.7 శాతం తదితరులు మార్కులు సాధించారని తెలిపారు. ఆయా విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం : మంత్రి కారుమూరి

ప్రజాశక్తి - తణుకు

ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని రాష్ట్ర పౌర సరఫరాలు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం సాయంత్రం తణుకు 2వ వార్డు సంత మార్కెట్ దగ్గర శివాలయం గుడి నుండి 49వ రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రికి వార్డు ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. ప్రతి గడపకూ వెళ్లి వారు పొందిన సంక్షేమ పథకాలను తెలిపే బుక్ లెట్ ను అందించి, వారికి ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా, అర్హత ఉండి పథకాలు ఏమైనా అందలేదా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మూడేళ్లలో పట్టణంలో ఇంటి స్థలం అందించిన వారందరికీ ఇల్లు కట్టించి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి ఇంటికీ నాలుగు, ఐదు పథకాలు అందాయని తెలిపారు. మరలా జగనన్నే ముఖ్యమంత్రిగా రావాలని ప్రజలు కోరుకుంటున్నారని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సత్యనారాయణకు ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి - ఉండి

ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామ పంచాయతీ 2వ వార్డు సభ్యులు, టిడిపి నేత ముగ్గళ్ల సత్యనారాయణ (సత్తిబాబు)ను ఎంఎల్ఎ మంతెన రామరాజు మంగళవారం పరామర్శించారు. అనారోగ్య కారణాలతో ఇటీవలే భీమవరంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో సత్యనారాయణ శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఆయనను ఎంఎల్ఎ పరామర్శించారు. ఆయన వెంట టిడిపి గ్రామ అధ్యక్షుడు దూసనపూడి రాంబాబు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు చెన్నంశెట్టి హరి నాయుడు, టిడిపి మండల ఉపాధ్యక్షుడు గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ ఉన్నారు.

మహిళా పక్షపాతి జగన్ : ఎంఎల్ఎ గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మహిళా పక్షపాతి ముఖ్యమంత్రి జగన్ ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని 21వ వార్డుకు చెందిన డ్వాక్రా సంఘం మహిళలు మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్‌ను కలిసి సమస్యలు తెలిపారు. వార్డులోని డ్వాక్రా సంఘాల సమావేశాలను ప్రతినెలా మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్ ప్రాంగణంలో పాఠశాల సెలవు రోజుల్లో నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. అయితే ఆ పాఠశాలకు ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న సిహెచ్ కామేష్ డ్వాక్రా సంఘ సమావేశాలకు అనుమతి లేదంటూ అడ్డుకుంటున్నారని ఎంఎల్ఎకు తెలిపారు. తాము ప్రతినెలా స్కూల్ మూసేసిన తర్వాత, సెలవురోజుల్లో మాత్రమే సమావేశాలు నిర్వహించుకుంటున్నామని తెలిపారు. దీనిపై స్పందించిన ఎంఎల్ఎ వెంటనే మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణకు ఫోన్ చేసి ఆదేశాలు జారీ చేశారు. డ్వాక్రా సంఘాల మహిళలు సమావేశాలు నిర్వహించుకుంటారని విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. అనంతరం ఆయన మహిళలతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి డ్వాక్రా మహిళలకు విడతల వారీగా రుణమాఫీ చేస్తున్నారని వివరించారు. అర్హులకు ఇంకా సంక్షేమ పథకాలు అందకపోతే తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జంగం శరమ్మ, పుచ్చకాయల మరియమ్మ, కాయల జయలక్ష్మి, తాడి కుమారి, రేణుక, రేవతి, సంతోష్, సావిత్రి,మాధవి పాల్గొన్నారు.

వరుస చోరీ కేసుల్లో వ్యక్తి అరెస్టు

రూ.5.14 లక్షల బంగారు , వెండి వస్తువులు, 8 మోటార్ సైకిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - తణుకురూరల్

తణుకు సర్కిల్‌తో పాటు రాజమండ్రి, భీమడోలులో వరుస చోరీలకు పాల్పడిన ముద్దాయిని తణుకు రూరల్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. నిందితుడి నుండి రూ.5 లక్షల 14 వేల ఐదువందలు విలువైన బంగారు, వెండి వస్తువులు, 8 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. తణుకు రూరల్ పోలీస్ స్టేషన్ లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చోరీకి సంబంధించిన వివరాలు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ ఆంజనేయులు వెల్లడించారు. తాడేపల్లిగూడెంకు చెందిన ప్రస్తుతం ఉంగుటూరు మండలం గోపీనాథపట్నంలో ఉంటున్న పైబోయిన ధనవెంకట రాము జల్సాలకు అలవాటు పడి దొంగతనాలను వృత్తిగా చేసుకున్నాడు. ఈ క్రమంలోనే తణుకు సర్కిల్ పరిధి, రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో 3 మోటారు సైకిళ, ఇరగవరం పోలీసు స్టేషన్ పరిధిలో 2 మోటారు సైకిళ్లు, రాజమండ్రి 1వ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో 1 మోటారు సైకిల్, భీమడోలు పోలీసు స్టేషన్ పరిధిలో రాత్రి పూట దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. బయట తాళాలు వేసి ఉన్నట్లుగా కనబడే ఇళ్లను లక్ష్యంగా చేసుకొని ఇంటిలోకి ప్రవేశించి బీరువాలను బద్దలు కొట్టి బిరువాలో ఉన్న విలువైన బంగారు, వెండి వస్తువులు, నగదు దొంగిలించుకుపోవడం, మారు తాళములతో తాళము వేసిఉన్న ద్విచక్రవాహనములు దొంగిలించడం చేస్తున్నాడన్నారు. అతనిపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల పరిధిలో సుమారు 70కి పైగా కేసులు ఉన్నాయన్నారు. నిందితుడిని అరెస్టు చేసిన సిఐ సిహెచ్ ఆంజనేయులు, రూరల్ ఎస్ఐ ఎం.రాజ్‌కుమార్, కానిస్టేబుల్స్ ఎ శ్రీనివాస్, ఎస్‌కె అన్వర్, ఎస్‌కె అక్బర్‌లాల్, కె.మహేశ్‌ను జిల్లా ఎస్‌పి రవిప్రకాష్ అభినందించారు.

26 నుంచి 30 వరకూ జగనన్న క్రీడా సంబరాలు

భీమవరం : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ రాష్ట్ర వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు జగనన్న క్రీడా సంబరాలు జిల్లాలో ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు జిల్లా చీఫ్ కోచ్ పి.సురేంద్ర తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా అంతటా నిర్వహించే ఈ పోటీలకు 17 ఏళ్లు పైబడిన యువతీ, యువకులు అర్హులని తెలిపారు. ఈ పోటీలకు హాజరయ్యేవారు పాస్ పోర్టు సైజ్ ఫొటోతో పాటు ఆధార్‌కార్డు జిరాక్స్‌తో హాజరు కావాలని తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో కబడ్డీ, వాలీబాల్ క్రికెట్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 29 నుంచి 30వ తేదీల్లో జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనడం జరుగుతుందని తెలిపారు.

వైఎన్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

నరసాపురం టౌన్: భీమవరం ఎస్‌కెఎస్‌డి కళాశాలలో ఈ నెల 18వ తేదీన నిర్వహించిన యువజనోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో వైఎన్ కళాశాల విద్యార్థులు విజయం సాధించినట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చినమిల్లి సత్యనారాయణ తెలిపారు. వకృత్వ పోటీలో రుమైస ప్రథమ బహుమతి, వ్యాసరచన పోటీలో ఉమామహేశ్వరి ప్రథమ, వ్యాసరచన (ఇంగ్లీష్) పోటీలో వై.టిమరచి ప్రథమ, జానపద సంగీతంలో జి.ఆసాలత తృతీయ, మోడ్రన్ సాంగ్ పోటీలో వి.లక్ష్మీ బహుమతి, క్విజ్ పోటీల్లో జి.శ్యామ్ ప్రథమ, గ్రూప్ డిస్కషన్ పోటీలో డి.రూప ప్రథమ బహుమతి సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను రసాల ప్రిన్సిపల్ అండ్ అధ్యాపకులు అభినందించారు.

మహారాజశ్రీ అడిషనల్ జుడిషియల్ ఫస్టు క్లాసు మెజిస్ట్రేట్ వారి కోర్టు, తాడేపల్లిగూడెం

O.S. 593/2021

బిట్వీన్:
నీలం నాగ అయ్యప్పస్వామి -వాది
మరియు
తన్నిడి నాగ వెంకట మణికుమార్ -ప్రతివాది

ప్రతివాది: తన్నిడి నాగ వెంకట మణికుమార్, S/o. రాంబాబు, ఇంటి నెం. 4-167-3, 1వ వార్డు, గణేష్ నగర్, తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా - 534101.

పై నెంబరు గ్రంథంలో శ్రీ కోర్టు ద్వారా ప్రతివాదికి సమన్లు పంపించినప్పటికి అవి తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు సబ్‌స్టిట్యూట్ ఉత్తర్వులు ప్రకారం **ది. 29-11-2022వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని ఆక్షేపణలు ఏమైనా ఉన్నచో తెలుపవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానం చేయబడును.

అద్దంకి విజయరత్నం, అడ్వకేట్
తాడేపల్లిగూడెం తాడేపల్లిగూడెం
ది.19-11-2022 సెల్:9290188928

మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు :: ఏలూరు
ఇ.పి. నెం. 37/2019 ఇన్ ఒ.ఎస్. నెం. 65/2016

బిట్వీన్:
వేమా సత్యనారాయణ మరియొకరు
...పిటీషనర్స్ /డిక్రీ హోల్డర్స్
మరియు
పులిగోపాలరావు
...రెస్పాండెంటు /జడ్జిమెంటు డెటార్

పై నెంబరు వారంటు గ్రంధములో ఈ దిగువ షెడ్యూలు స్థిరాస్తులను పై కోర్టు వారి ఎదుట **ది.16-12-2022న ఉదయం గం॥ 10:30 ని॥లకు బహిరంగ వేలం వేయబడును.** సదరు వేలంలో పాల్గొనదలచిన వారు సదరు తేదీన పై కోర్టులో స్వయంగా హాజరై పాడుకొనవచ్చును. పాట షరతులు వగైరా విషయములను గురించి కోర్టు నజారత్ వారిని సంప్రదించగలరు.

SCHEDULE

In West Godavari District, Eluru Sub-Di, Eluru Mandal, Jalipudi Panchayat, Jalipudi Village.

Item No.1:
R.S.No. 281, Zirayati Wet Land admeasuring AC. 0-92 Cents Bounded by:
East: Land of Kola Prasad.
South: Land of Surat Rama Rao.
West: Land of Pydipati Rama Krishna.
North: Land of Bandi Srinivas.
Decree Holders Value : Rs.18,20,000/-
Amin Value : Rs. 23,92,000/-

Item No.2:
R.S.No. 295/1, Zirayati Wet Land admeasuring AC. 1-00 Cents Bounded by:
East: Road.
South: Land of Thoomu Ramu.
West: Land of Thota Aadhi Lakshmi.
North: Land of Badarala Satyanarayana.
Decree Holders Value : Rs.20,00,000/-
Amin Value : Rs.26,00,000/-

గమనిక: వేలంలో పాల్గొనదలచిన పాటదార్లు పై వేలపు తేదీన వారియొక్క ఆధార్ కార్డుతో హాజరై వారి యొక్క అఫిడవిట్ దాఖలు చేయవలయును. వేలం ముగిసిన వెంటనే Successful పాటదారు తను పాడిన మొత్తంలో 1/4వ వంతు సొమ్ము శ్రీవారి కోర్టులో డిపాజిట్ చేయవలయును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులను అనుసరించి)

కోరుకొండ రాజారామమోహన్,
జి.వి.రమణమూర్తి,
ఏలూరు, డిక్రీ హోల్డర్స్ తరపు న్యాయవాదులు,
13-11-22. అగ్రహారం, ఏలూరు.
సెల్:9440420223

MUNICIPAL CORPORATION, ELURU

e-PROCUREMENT TENDER NOTICE No: 150/CMDF-Grant/2022-23, Dated. 22-11-2022

The Commissioner, Municipal Corporation, Eluru invites tenders from interested, eligible bidders for **"Construction of CC Drain at SMR Nagar in Municipal Corporation, Eluru"** Total No. of work is **1** with an amount of Rs. **10.70** Lakhs.

Tender schedules are available on e-procurement market place from 23-11-2022. Last date of receipt of tenders is 28-11-2022. Further details can be seen at e-procurement market place at **www.apeprocurement.gov.in** or contact Commissioner, Municipal Corporation, Eluru, Eluru District (Phone/ Fax: 08812-245990).

Sd/- **COMMISSIONER**
MUNICIPAL CORPORATION, ELURU